వీసీతో సుదీర్ఘ చర్చ

తెలంగాణ విద్యాకమిటీ చైర్మన్ ఆకునూరి మురళి సోమవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంను సందర్శించారు. వీసీ జానయ్యతో సుదీర్ఘంగా చర్చించారు. విశ్వవిద్యాలయంలోని పరిశోధన, విస్తరణ, విద్యతో పాటు ,రాష్ట్రంలోని విద్యావిధానంపై చర్చించారు. విజిలెన్స్ అవేర్నెస్ వారోత్సవాల్లో భాగంగా అవినీతి వ్యతిరేకతపై టీచింగ్ ,నాన్ టీచింగ్ ఉద్యోగులను ప్రతిజ్ఞ చేయించారు.

- వ్యవసాయ యూనివర్సిటీ

హక్కులు కాపాడుకోవాలి

హిమాయత్‌నగర్ : కార్మికవర్గం ఐక్యతతో ముందుకుసాగి హక్కులను కాపాడుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ పిలుపు నిచ్చారు. సోమవారం ఎస్ఎన్ రెడ్డి భవన్‌లోవిలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా.. కార్మికుల జీవితాలకు భరోసాలేదన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా పనిచేస్తుందని విమర్శించారు. ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వయంఉపాధి అవకాశాలపై విద్యార్థులు దృష్టి సారించాలి

విద్యతో పాటు నైపుణ్యాలను పెంచుకుని స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని బాబు జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సూచించారు. ' గ్రామీణ సమాజానికి స్వయంఉపాధి – సుస్థిర అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర' పై సోమవారం నారాయణగూడలోని బీజేఆర్ కాలేజీలో సదస్సు జరిగింది. వక్తలు విద్యార్థులు తమ కెరీర్‌కు ఉపయోగపడే అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ నాగయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ కె.నాగయ్య, సీ హెచ్. ముత్తయ్య, అరుణ, డాక్టర్ నర్సిం లు, సూర్యకుమారి, డాక్టర్ మనోజ్‌కుమార్, డా. బాలస్వామి, స్వాతి పాల్గొన్నారు.

బయో మాఫియాతో.. పొంచిఉన్న ప్రమాదం

ఖైరతాబాద్‌లో బస్తీల మధ్య గుట్టుగా డంపింగ్

అక్రమంగా జనావాసాల నడుమ వ్యర్థాల తరలింపు

ప్యాక్ చేసిన బయో వ్యర్థాలు.. బయటకు వచ్చిన సర్జికల్ బాక్స్ (ఇన్‌సెట్‌లో..)

ఖైరతాబాద్, అక్టోబర్ 28 : ఖైరతాబాద్‌లోని పలు బస్తీల ప్రజలు ప్రమాదపుటంచున్న జీవితాలు వెల్లదీస్తున్నారంటే.. ఔననే సమాధానం వస్తోంది. వందలాది కుటుంబాలు నివసిస్తున్న బస్తీల మధ్య గుట్టుగా బయో మాఫియా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంతో కాలంగా ఈ వ్యవహారం సాగుతున్నా జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు దీనిపై దృష్టిపెట్టడం లేదని బస్తీవాసులు చెబుతున్నారు. వివిధ ప్రైవేట్ దవాఖానలకు సంబంధించిన బయో వ్యర్థాలను ఇక్కడ అక్రమంగా డంప్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఫలితంగా అంతుచిక్కని వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉన్నది. ఈ వ్యర్థాలను ఇక్కడ వేసేందుకు కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానలు ఈ స్థలాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. బయోవ్యర్థాలను ప్రభుత్వ నిబంధనల మేరకు నగరానికి దూరంగా తీసుకెళ్లి పూడ్చిపెట్టడమో, లేక వాటిని ద్రావణంలో వేసి కాల్చివేయడమో చేస్తుంటారు. కానీ ఈ బయో మాఫియా ప్రమాదకరమైన ఆ వ్యర్థాలను జనావాసాల మధ్య వేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ వ్యర్థాలను వ్యాపారంగా మల్చుకొని యథేచ్ఛగా కొందరు పెద్దలు తమ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు సమాచారం.

గుట్టలు..గుట్టలుగా దవాఖాన వ్యర్థాలు

ఖైరతాబాద్‌లోని శ్రీనివాస్‌నగర్, ఇందిరా నగర్, న్యూ సీఐబీ క్వార్టర్స్, ఆంధ్రాగల్లి మధ్యలో బీజేఆర్ నగర్‌కు ఆనుకొని ఈ ప్రైవేట్ స్థలంలో పూర్వం కల్లు కాంపౌండ్ ఉండేది. ప్రస్తుతం పాత కల్లు కాంపౌండ్ ప్రాంతంగా ఇక్కడి వారు పిలుస్తుంటారు. విశాలంగా ఉన్న ఈ ఖాళీ స్థలంలో కొందరు బయో వ్యర్థాల వ్యాపారాలకు అడ్డగా మార్చుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దవాఖాన వ్యర్థాలైన సిరంజీలు, వాయిల్స్, గ్లుకోస్ బాటిళ్లతో పాటు ఆపరేషన్ పూర్తి చేసిన తర్వాత నిరూపయోగమైన గ్లౌజులు, ఇతర పరికరాలను తీసుకువచ్చి ఇక్కడ వేసి ప్యాకింగ్ చేస్తున్నారు. పాత కల్లు కాంపౌండ్‌తో పాటు బస్తీలోకి వెళ్లే రహదారులపై కూడా బయో వ్యర్థాలతో కూడిన ఆటో టిప్పర్లను పార్కింగ్ చేయడంతో రోడ్డు మూసుకుపోవడంతో పాటు వాటి నుంచి వచ్చే భయంకరమైన దుర్వాసతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని వ్యాపారం చేసేందుకు కొందరు అమాయకులైన పేదలను పురమాయించారు. ఇందులో ఎవరూ ప్రవేశించకుండా ఆ పేదలను కవచాలుగా ఉపయోగించుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. వారు ఇక్కడే గుడిసెలు వేసుకొని జీవిస్తూ ఆయా బయో వ్యర్థాలలో వాడేసిన కొన్ని ప్లాస్టిక్ సిరంజీలు, బాటిళ్లు, గ్లుకోజు బాటిళ్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ బయో వ్యర్థాల వల్ల మందుల్లేని, అంతుచిక్కని వ్యాధులు వస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

బయో వ్యర్థాల విషయం మా దృష్టికి వచ్చింది

ఖైరతాబాద్‌లోని పాత కల్లు కాంపౌండ్ స్థలంలో బయో వ్యర్థాల వేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. జనావాసాల మధ్య బయో వ్యర్థాలను వేయడం ప్రమాదకరం. ఏ దవాఖానల నుంచి ఇక్కడ బయో వేస్టేజ్ డంపింగ్ చేస్తున్నారో విచారణ జరిపిస్తాం. బాధ్యులెవరైనా వారిపై చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ చంద్రశేఖర్, ఏఎంవోహెచ్

కుసుమ నూనె ఆరోగ్యానికి మేలు

సమావేశంలో పాల్గొన్న ఐసీఏఆర్ – ఐఐఓఆర్ న్యూఢిల్లీ డీడీజీ డా.శర్మ

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 28 : కుసుమ నూనె ఆరోగ్యానికి మేలు చేస్తుందని, కుసుమలో ముల్లులేని రకాలను కనుగొనేలా పరిశోధనలు జరుగాలని జాతీయ నూనెగింజల పరిశోధనా మండలి (ఐసీఏఆర్ – ఐఐఓఆర్ న్యూఢిల్లీ) డీడీజీ డా.శర్మ అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వాటర్ టెక్నాలజీ సమావేశ మందిరంలో జాతీయ నూనెగింజల పరిశోధనలు, పీజేటీఎస్ఏయూ ప్రణాళిక రూపకల్పన రెండురోజుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇతర దేశాల నుంచి రూ.1.7 లక్షల కోట్లు వెచ్చించి నూనెలను దిగుమతి చేసుకుంటున్నామన్నారు. దీనిని తగ్గించడానికే భారత జాతీయ నూనెగింజల మిషన్‌ని ఏర్పాటు చేశారన్నారు. కుసుమలో లైనోలేనిక్ ఆసిడ్ ఉన్నందున కరోనా నాటి నుంచి డిమాండ్ పెరిగిందన్నారు.

ఏడీజీ డా.సంజీవ్ మాట్లాడుతూ.. కుసుమ, అవిసెల సాగుకు అధిక రాష్ట్రాల వాతావరణం అనుకూలమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూనెగింజల సాగుకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. రైతు అవగాహన సదస్సులు, పరిశోధనలు పెరిగాయని మరింత పెరుగాల్సిన అవసరం ఉందన్నారు. రబీలో కుసుమ సాగు ఎక్కువగాఉంటుందని, వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులకు నూనెగింజల సాగు, చీడపీడలపై అవగాహన కల్పిస్తున్నామని పీజేటీఎస్ఏయూ అగ్రికల్చర్ డీన్ జెల్లా సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలోప్రధాన శాస్త్రవేత్త డా.సి.సుధాకర్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం వివిధ రాష్ట్రాల ఆదర్శరైతులు, శాస్త్రవేత్తలను సన్మానించారు.

ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్యభవన్‌లో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ది ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్ అధ్యక్షుడు వెంకటసుబయ్య తదితరులు – ఖైరతాబాద్

యూసుఫ్‌గూడలో ప్రజావాణి..

యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ కార్యాలయంలో సోమవారం డీసీ జకియా సుల్తానా ఆధ్వర్యంలో అధికారులు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

- జూబ్లీహిల్స్

బస్తీవాసుల సమస్యలు పరిష్కరించండి

బంజారాహిల్స్, అక్టోబర్ 28 : బస్తీల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. శ్రీ వెంకటేశ్వరనగర్ బస్తీలో స్థానికుల సమస్యలను తెలుసుకునేందుకు సోమవారం కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పర్యటించారు. పలు వీధుల్లో వీధిదీపాలు వెలుగడం లేదని, సీసీ రోడ్లు పాడయ్యాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో జీహెచ్ఎంసీ ఏఈ సతీశ్‌తో పాటు జలమండలి అధికారులను అక్కడకు పిలిపించి సమస్యలు వివరించారు. వీధిదీపాల విభాగం అధికారులకు కాల్ చేసి వెంటనే పాడయిన లైట్లను మార్చాలని కోరారు.

చెత్తను తరలించిన..

జీహెచ్ఎంసీ సిబ్బంది

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ఖైరతాబాద్, అక్టోబర్ 28 : ఖైరతాబాద్ ఇందిరానగర్‌లోని డబుల్ బెడ్రూం గృహ సముదాయంలో వ్యర్థాలు పేరుకుపోవడంతో ' చెత్త అక్కడే.. చెత్త వాహనం అక్కడే' అనే శీర్షికతో 'నమస్తే'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే సిబ్బందితో చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు.

జేఎన్ఏఎఫ్ఏయూకు స్థలం కేటాయింపుపై హర్షం

జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీలో స్థలం కేటాయించడం హర్షణీయమని జేఎన్ఏఎఫ్ఏయూ ప్రిన్సిపాల్ ప్రొ.గంగాధర్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ..జేఎన్ఏఎఫ్ఏకు స్థలాన్ని కేటాయించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జేఎన్ఏఎఫ్ఏయూ డీఏపీ వినోద్, డైరెక్టర్ ఎస్. కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాసూమ్ అలీ, ప్రొ. ఎంఎల్ ఆనంద్ పాల్గొన్నారు.

- ఖైరతాబాద్

వరల్డ్‌బెల్ట్ రెజ్లింగ్ పోటీలకు ప్రకాశ్‌సింగ్

వరల్డ్‌బెల్ట్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ – 2024కు మణికొండకు చెందిన ప్రకాశ్‌సింగ్ గాడిళ్ల సెలక్ట్ అయ్యారు. నవంబర్‌లో రష్యాలో జరిగే చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు వెల్లడించారు. సెలక్షన్స్ కోసం జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచారన్నారు. ఆల్ ఇండియా ట్రెడిషనల్ రెజ్లింగ్ అండ్ పన్‌క్రేషన్ ఫెడరేషన్ అండ్ ఏషియా ఐలాష్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఓమర్‌ముక్తార్ తంబోలి చేతుల మీదుగా పత్రం అందుకున్నారు. నవంబర్ 10 నుంచి 17 వరకు ఖాజన్‌లో జరుగుతాయని వెల్లడించారు. ప్రకాశ్‌సింగ్ తెలంగాణ నుంచి సీనియర్ మెన్ 90 కేజీల విభాగానికి ఎంపికైనట్లు వెల్లడించారు.

- మణికొండ

జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటారు

న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి పాకశాస్త్ర నైపుణ్య పోటీల్లో రీజెన్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. బనార్సిదాస్ చాందీవాలా హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆధ్వర్యంలో మూడురోజులు నిర్వహించిన పోటీల్లో 25 రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. జే.అరవింద్–అరవింద్ జోడీ, ఎన్.కార్తీక్, నందకుమార్–సెఫీ జోడీ, జే. అరవింద్ వేర్వేరు విభాగాల్లో నాలుగు బంగారు పతకాలు సాధించారు. వీరితో పాటు మరో నాలుగు జోడీలు వెండి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో అత్యధిక పతకాలు సాధించిన రీజెన్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల జట్టుకు ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కిందని ప్రిన్సిపాల్ రమేశ్‌కుమార్ రెడ్డి తెలిపారు. వారని అభినందించారు.

- బంజారాహిల్స్

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి

ప్రతిజ్ఞ చేయిస్తున్న రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

మైలార్‌దేవ్‌పల్లి : విద్యార్థులు సన్మార్గంలో నడిచినపుడే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ పేర్కొన్నారు. మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్, ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీసీపీ సుభిరామ్‌రెడ్డితో కలిసి ఏసీపీ బాలాజీ పాల్గొన్నారు. విద్యార్థుల కదలికపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులతో డ్రగ్స్ వాడకుండా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, సీహెచ్.మల్లేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూస్తాం

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. ఆరాంఘర్ చౌరస్తాలోని అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి ప్రాంతంలోని రోడ్డును ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, జీహెచ్ఎంసీ అధికారి నర్సింహామూర్తితో కలిసి సందర్శించి రోడ్డు పునరుద్ధరణ పనులపై చర్చించారు.పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

గ్రేవ్ యార్డుల ఆధునీకరణ పనులు

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో జీహెచ్ఎంసీ అధికారులు గ్రేవ్‌యార్డుల ఆధునీకరణ పనులు చేపడుతున్నారు. దీపావళి సందర్భంగా ప్రజలు సంప్రదాయబద్ధంగా చేపట్టే పెద్దల సంస్మరణ కార్యక్రమాల కోసం శ్మశానవాటికల్లో పరిశుభ్రత పనులు చేపడుతున్నారు. ఈఈ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు పనులు పరిశీలించారు.

- జూబ్లీహిల్స్

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న హాల్ మార్క్ పిసినీయ, మై హోమ్ అవతార్ నివాసితులు

మణికొండ, అక్టోబర్ 28 : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. హాల్ మార్క్ పిసినీయ, మై హోమ్ అవతార్ నివాసితులు సోమవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆర్ఎంసీ ప్లాంట్ వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని తక్షణమే క్లోజ్ చేయించాలని కోరారు. రోడ్ల నిర్మాణం, మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుపై వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్ఎంసీ ప్లాంట్‌పై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, ఇప్పటికే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. టాఫిక్ సిగ్నల్‌పై అధికారులతో సంప్రదింపు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సీసీ రోడ్ల పనులు ప్రారంభం కానున్నాయని, ప్రజలంతా సహకరించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మల్లేశ్, రామకృష్ణారెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎన్ రెడ్డి భవన్ వద్ద వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 28 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్ డిమాండ్ చేశారు. సోమవారం శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ధర్నాకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎప్పటికప్పుడు విడుదల చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్లను విడుదల చేయాలన్నారు.విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రోజులు లెక్కపెట్టుకోవాన్నారు. ఆందోళనలో విద్యార్థి నాయకులు హర్ష, సతీశ్, సాయి, స్పందన, సోనాలి, ప్రవళిక, తరుణ్, మహేశ్ పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ రవీందర్ దత్‌కు వినతి పత్రం అందజేశారు.

నేటి నిరసన దీక్షకు తరలిరావాలి

హిమాయత్‌నగర్,అక్టోబర్ 28 : ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నేడు (మంగళవారం) హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్ వద్ద నిరసన దీక్ష చేస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో వారు ఆవిష్కరించారు. విద్యార్థులు అధికసంఖ్యల్లో తరలివచ్చి నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇటిక్యాల రామకృష్ణ, నెల్లి సత్య, వంశీవర్ధన్‌రెడ్డి, అన్వర్, ఉదయ్‌కుమార్, హరీశ్, అరుణ్, లెనిన్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

హిమాయత్‌నగర్ : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం నారాయణగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై షఫీ తెలిపిన వివరాల ప్రకారం.. విక్రంనగర్ పార్కు సమీపంలో పుట్‌పాత్‌పై గుర్తు తెలియని ఓ వ్యక్తి (45) అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు 100కు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లిన నారాయణగూడ పోలీసులు 108లో చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒంటిపై క్రీమ్ షర్ట్, యాష్ ప్యాంట్ ఉందని, మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించామని పోలీసులు తెలిపారు. సంబంధీకులుంటే 040- 27852579ను సంప్రదించాలని సూచించారు. కేసు దర్యాప్తు లో ఉన్నది.

సమస్యల వలయంలో.. నెమలినగర్

నెమలినగర్ కాలనీలో ఎక్కడికక్కడా చెత్తచెదారంగా దర్శనమిస్తున్న కాలనీ ప్రధాన రహదారి

మణికొండ, అక్టోబర్ 28 : తాగడానికి నీళ్లులేవు.. నడవడానికి రహదారులు లేవు.. రాకపోకలకు బస్సు సౌకర్యం లేదు.. పొంగి పొర్లుతున్న మురుగునీరు, ఎక్కడికక్కడా చెత్తాచెదారం.. విద్యుత్ అంతరాయం ఇలా ఒకటి కాదు అన్నీ సమస్యలే. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు మరిచారంటూ నివాసితులు బోరుమంటున్నారు. ఒక్కసారి జిల్లాస్థాయి అధికార యంత్రాంగమైనా స్పందించాలని వేడుకుంటున్నారు. పూర్తి వివరాలల్లోకి వెళితే..

మణికొండ మున్సిపాలిటీ అంటే రాష్ట్రంలో అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతంగా అనుకుంటున్నారు. అక్కడ పుప్పాలగూడలో నెమలినగర్ కాలనీ ఉన్నది. మూడు వేల జనాభా ఇందిరమ్మ ఇండ్లల్లో నివాసముంటున్నారు. గత పంచాయతీ హయంలో పుప్పాలగూడ పరిధిలోకి ఈ కాలనీ వచ్చేది. ప్రస్తుతం మణికొండ మున్సిపాలిటీలోకి వచ్చి చేరింది. సమస్యలను ప్రజాప్రతినిధులకు విన్నవించినా పరిష్కరించిన దాఖలాలు ఏమీ లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తాగునీటి వసతులు లేక ఎక్కడో మారుమూల గ్రామాల్లో వలే నీటి కులాయిల వద్ద ప్రజలు నీటిని తాగుతుండటం విశేషం. మున్సిపాలిటీ అధికారులకు తెలిసినా.. పాలకులకు తెలిసినా ప్రశ్నించే వారు లేకపోవడంతో సమస్యలన్నీ పడకేశాయని ప్రజలు మండిపడుతున్నారు.

బీఆర్ఎస్ నాయకుల పర్యటన..

నెమలినగర్ వాసుల సమస్యలను తెలుసుకునేందుకు సోమవారం మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు దూళిపాళ సీతారాం, బీఆర్ఎస్ నాయకుడు గుట్టమీది నరేందర్ నేతృత్వంలో పర్యటించారు. కాలనీలో కనీస వసతుల కల్పన ఏర్పాటు చేసేందుకు నోచుకోకపోవడంపై మండిపడ్డారు. మణికొండ బీఆర్ఎస్ తరపున పోరాటం చేస్తామనిని అధ్యక్షుడు సీతారాం తెలిపారు.

అక్రమ నిర్మాణాల జోరు..

నెమలినగర్‌కాలనీలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. జీ ప్లస్ –7 అంతస్తుల నిర్మాణాలను కేవలం 60 గజాల స్థలాల్లోనే చేయడం విశేషం. రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత బాధ్యత గల అధికార యంత్రాంగం వసతుల కల్పన అందించి, అక్రమాలను నిరోధించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

CAUTION NOTICE
PURCHASERS BEWARE

This Caution Notice is issued on behalf of My Client **Syed Abdul Majid** and his GPA Holder Syed Abdul Shakeel, R/o. Akbarpura, M.D. Lane, Toli chowki, Hyderabad, cautioning the Public in General , financial institutions, Banks and intending purchasers , not to enter into any sort of Sale and purchase transaction of the property in **Plot No. 52, Sy. No. 1, admeasuring 300 sq. yards, situated at Sri Devi Colony, Sag Bowli Village, RR District** in full, portion or in part from 1) Mohammed Shahabuddin S/o. Mohammed Zaheeruddin R/o. 2-4-79/127, Fort view colony, Upperpally, Rajendernagar, RR District 2) Mohammed Faizullah Shareef S/o. Mohammed Nawaz Shareef R/o.H. No. 1-7-55, Risala kurshadjahi , Musheerabad, Hyderabad and 3) Abdul Bari Siddiqui S/o. Abdul Nayeem Siddiqui R/o. 10-5-8/5, Ahmed Nagar, Masab Tank, Hyderabad.

The above named persons have no any right, title , interest in any manner in and over the property of my client in plot No.52 Sy. No. 1, SriDevi Colony, Sag Bowli village, RR District. The above persons earlier had entered into an unregistered Development Agreement cum General Power of Attorney undated in the month of February 2020, which was not acted on and the same was cancelled by my client by issuing the legal notice. The above persons is learnt to have trying illegally to enter into Sale Agreements, with intending purchasers , approaching financial institutions, Banks for mortgaging and obtaining loan on the property by showing the Development Agreement cum GPA and other documents fraudulently created by them and taking consideration amounts from the purchasers.

Therefore this caution notice is issued, informing and cautioning the public in general and other financial institutions, Banks etc, not to enter into any type of transactions with the above named 3 persons in respect of the property of my client and get cheated. Any document executed by the above 3 named persons in any nature over the above property of my client will be illegal and not binding on my client. If any transaction is entered into by any person(s) , with the above named 3 persons in any manner , they may take necessary action against the above named 3 persons and shall not make any claim in any manner from my client and over the property of my client detailed above.

Sd/- **Naresh Agarwal,** Advocate, Office at: Premises No. 9-6-217, Durga Bhawani Nagar, Santhosh Nagar Hyderabad. TG. **Ph. No. 9121706465**